క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం

గంట్యాడ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.సత్యం సూచించారు. మండలంలోని బుడతానపల్లి గ్రామంలో పేదలకు హెల్త్ హైజీనిక్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి ప్రయత్నించాలని, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారినపడ కుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి సహకారం



లయన్స్ క్లబ్ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న రాములు

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి రిటైర్డ్ అధ్యాపకులు దాసరి రాములు రూ.10 వేల ఆర్థిక సహకారం అందజేశారు. నగదును లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, డి.సీతారామరాజుకు పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం అందజేశారు. తన 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన పథకం నిర్వహణకు సహకారం అందజేసినట్లు దాత చెప్పారు.

వేసవి శిబిరం నిర్వహణకు సాయం



శిబిరంలో కోచ్‌లకు నగదు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌నకు ధర్మవరం వాసవీ క్లబ్ సభ్యులు రూ.5000 ఆర్థిక సహాయం చేశారు. నగదు మొత్తాన్ని చీఫ్‌కోచ్ పి.శ్రీరాములుకు శనివారం అందచేశారు. శిబిరంలో రోజూ క్రీడాకారులకు కోడిగుడ్లు, పాలు తదితర ఆహార పదార్థాలను వాసవీ క్లబ్ సభ్యులు అందజేస్తున్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కుసుమంచి సంతోష్, కార్యవర్గ సభ్యులు రేపాక వెంకటేష్, ఉప్పల రాజేష్, కాపుగంటి సతీష్, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గజపతినగరం: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ గంగరాజు అన్నారు. రహదారి భద్రతపై మండల కేంద్రంలో ద్విచక్ర వాహనచోదకులతో కలిసి శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

వేపాడ: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం సోంపురం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. ఫెయిలైన విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో సెలవుల్లోనూ ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పల్లెల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రుహానీ, సిబ్బంది

దత్తిరాజేరు/ బొండపల్లి: దత్తిరాజేరు మండలంలోని దత్తి గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్, బొండపల్లి మండలం కొండవానిపాలెం గ్రామంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.రుహానీ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరాల్లో ఓపీ(అవుట్ పేషెంట్) సేవలు అందించారు. అనంతరం గృహ సందర్శన బెడ్ రెస్ట్ రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యతనిఖీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అవినీతి రహిత సంక్షేమ పాలన

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా లంచాలకు తావులేకుండా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఇతర ప్రజాప్రతినిధులు అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా వలంటీర్ల సత్కార కార్యక్రమాలు ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు పథకాలు అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట, జామి, వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస, గుర్ల, గంట్యాడ, బొండపల్లి, చీపురుపల్లిరూరల్



జామి: కలగాడలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ అరుణ,జెడ్పీటీసీ సరయు, తదితరులు



కొత్తవలస: సంతపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ గోపెమ్మ, తదితరులు



చీపురుపల్లిరూరల్: పర్లలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ ,అధికారులు



బొండపల్లి: నెలివాడలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు



శృంగవరపుకోట: ముసిడిపల్లి సచివాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు



గుర్ల: చింతలపేటలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గంట్యాడ: రేగుబిల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి



వేపాడ: దబ్బిరాజుపేటలో వలంటీర్ల సన్మానంలో ప్రజాప్రతినిధులు,అధికారులు



లక్కవరపుకోట: మల్లివీడు సచివాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నడకతో ఆరోగ్యం



వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సభ్యులు

శృంగవరపుకోట: క్రమం తప్పని నడకతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. స్థానిక పుణ్యగిరి వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో వాకర్స్ డీజీ సత్యం మాట్లాడుతూ రోజూ నడకతో పాటు వ్యాయామం చేయాలన్నారు. క్లబ్‌ల ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలను వాట్సాప్‌లో పోస్టు చేయాలని, కొత్త క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఇంటర్నేషనల్ క్లబ్‌లో మహాత్మాగాంధీ ఫెలోషిప్ తీసుకోవాలని, తద్వారా ఇంటర్నేషనల్ క్లబ్ చేసే కార్యక్రమాలు తెలుసుకునే వీలుందని, వాటిలో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. క్లబ్ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందు కు రావాలని పిలుపు నిచ్చారు. డిప్యూటీ గవర్నర్ ఈ.విజయ్ కుమార్, రీజియన్ కౌన్సిలర్ కె.ఎర్నాయుడు, కేబినెట్ ట్రెజరర్ కె.వి.రమణమూర్తి, సెక్ర టరీ టి.చిరంజీవిరావు తదితరులు ఎస్.కోట వాకర్స్ క్లబ్ సేవలను కొనియాడారు. అనంతరం ఎస్.కోట క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును సన్మానించారు. క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర,అవయవదానానికి అంగీకారం



నేత్ర,అవయవదానానికి అంగీకారం చెబుతున్న వేతనదారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): వారంతా వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ వేతనదారులు... ఉన్నత చదువులు చదువుకోపోయినా ఉన్నతంగా ఆలోచించారు. స్వచ్ఛందంగా నేత్ర, అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు. గరివిడి మండలం గదబవలస గ్రామానికి చెందిన 90 మంది నేత్ర, అవయవ దానానికి అంగీకారం తెలిపారు. మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి. గోవిందరాజులు గదబవలసలో ఉపాధి వేతనదారులకు నేత్ర, అవయవదానంపై శనివారం అవగాహన కల్పించారు. దీంతో 90 మంది నేత్ర, అవయవదానం చేసేందుకు తమ అంగీకారం తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ మరణానంతరం తమ నేత్ర,అవయవాలు మట్టిలో కలిసిపోకుండా వేరొకరికి కంటి చూపు ప్రసాదించడంతో పాటు, ప్రాణాలు నిలిపేందుకు నేత్ర,అవయవదానానికి అంగీకారం తెలిపామని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ రాజరాజేశ్వరి



చీపురుపల్లిరూరల్: కోడూరులో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర



జామి: అలమండలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమలకుమారి,వైద్యసిబ్బంది



వేపాడ: దబ్బిరాజుపేటలో అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు, ఎంఎల్‌హెచ్‌పీలు



మెరకముడిదాం: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

చీపురుపల్లి/ చీపురుపల్లి రూరల్/ జామి/ వేపాడ/ మెరకముడిదాం: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీఓలు, సూపర్‌వైజర్లు సూచించారు. ప్రపంచ రుతుక్రమం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మహిళలు, కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, హ్యాండ్ వాష్, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సఖిగ్రూపుల నిర్వహణ, రక్తహీనత సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారంతా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఓ రాజరాజేశ్వరి, గరివిడి మండలం కోడూరులో పీఓ ఆరుద్ర, జామి మండలం అలమండలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమలకుమారి, వేపాడలో ఐడీఎస్ ఏపీడీఓ లక్ష్మీబాయి, సూపర్‌వైజర్లు జి.కామేశ్వరీ,పి.భాగ్యవతి, చామలాపల్లి, దబ్బిరాజుపేట నీలకంఠరాజపురం గ్రామాల్లో మహిళా పోలీసులు నాగమణి, శ్రీదేవి, మెరకముడిదాం సచివాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాడ్డి శ్రీదేవి, మీసాల నాగమణి, సర్పంచ్ బోనెలకన్నమ్మ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్ల బిల్లుల చెల్లింపు



గజపతినగరం రూరల్: పాతబగ్గాంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేష్



వేపాడ: జగ్గయ్యపేటలో లబ్ధిదారులతో సమావేశమైన అధికారులు



కొత్తవలస: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ

వేపాడ: జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను నిర్మాణ దశల ఆధారంగా సకాలంలో లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లిస్తోందని మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగ్గయ్యపేటలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగా తెలుసుకున్నారు. నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే బిల్లు సరిపోకపోతే ఐకేపీలో రూ. 35 వేల రుణం పొంద వచ్చ ని తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ అప్పలనాయుడు, ఉపాధి, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాలను వేగవంతం చేయండి

గజపతినగరం రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ లబ్ధిదారులను కోరారు. హౌసింగ్‌డేలో భాగంగా పాతబగ్గాం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు.అనంతరం పిడిశీల గ్రామంలో నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామస్తులతో మాట్లాడి, ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ అరుణ, ఎంపీడీఓ సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయండి

కొత్తవలస: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ వై.పద్మజ లబ్ధిదారులకు సూచించారు. శనివారం హౌసింగ్‌డేలో భాగంగా మండలంలోని ఉత్తరాపల్లి సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ నిర్మాణాలకు అవసరమైన సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందని, పనులు వేగవంతం చేయాలన్నారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగంపల్లి గణేష్ పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

గుర్ల: అక్రమ రవాణాకు సంబంధించి రెండు కేసుల్లో సీజ్ చేసిన ఇసుకను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ హరిబాబునాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక వేలం రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు



కాలిపోయిన ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్ల నిర్మాణాలకు మట్టి గోడల తొలగింపు పనులు

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో ఏడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బి.వి.గోవిందరాజులు, రెడ్డి రమణ కలిసి నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాధితులకు అండగా...

అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్ల స్థానంలో పక్కా గృహాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గృహనిర్మాణశాఖ అధికారులకు ప్రమాదం జరిగిన రోజే ఆదేశించారు. దీంతో అధికారులు అక్కడ ఇళ్ల నిర్మాణాలకు స్థలం చదును చేయాలని బాధితులకు సూచించారు. బాధితులపై ఆర్థిక భారం పడకుండా స్థలం చదును పనులను చేయించేందుకు స్థానిక సర్పంచ్ మజ్జి అన్నపూర్ణమ్మ తనయుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. తన సొంత నిధులు సుమారు రూ.60 వేలు ఖర్చుచేసి జేసీబీ సహాయంతో మట్టిగోడల తొలగింపు, నేల చదును, ఇతర పనులు చేయిస్తున్నారు.

అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

- మండలాల అధికారులకు ప్రత్యేక అధికారుల ఆదేశం



గంట్యాడ: సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి మురళీకృష్ణ



చీపురుపల్లి: సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్



బొండపల్లి: అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీపీ చలం నాయుడు



కొత్తవలస: అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేక అధికారి పాపారావు



వేపాడ: అధికారులతో చర్చిస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

చీపురుపల్లి/గంట్యాడ/ కొత్తవలస/ వేపాడ: గ్రామాల్లో అభివృద్ధి పనులను, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండలాల అధికారులకు ప్రత్యేక అధికారులు ఆదేశించారు. చీపురుపల్లి, గంట్యాడ, కొత్తవలస, వేపాడ మండల పరిషత్ కార్యాలయాల్లో మండల అధికారులతో శనివారం కన్వర్జెన్సీ సమా వేశం నిర్వహించారు. చీపురుపల్లి మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, గంట్యాడ, కొత్తవలస, వేపాడ మండలాల ప్రత్యేక అధికారులు మురళీకృష్ణ, ఆర్.పాపారావు, పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ ఆయా మండలాల్లో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరారు. పాఠశాలల్లో నాడు– నేడు పనులను వేగవంతం చేయించాలని, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాల భవన నిర్మాణాలను, జలజీవన్ మిషన్ పనులను పూర్తిచేయించాలని చెప్పారు.చీపురుపల్లి, గంట్యాడ, కొత్తవలస, వేపాడ ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, భానోజీరావు, ఎంపీడీఓ వై.పద్మజ, బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్ , చీపురుపల్లి, వేపాడ తహసీల్దార్‌లు ఎం.సురేష్, కృష్ణంరాజు, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖ ఏఈలు, ఐసీడీఎస్ పీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్బీకే భవనాలను ప్రారంభానికి సిద్ధం చేయండి

బొండపల్లి: మండలంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి, ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అధికారులను ఆదేశించారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి ఎన్.వి.కె.దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం శనివారం నిర్వహించారు. చామలవలస, కనిమెరక గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించడంతో పాటు కేటాయించి, త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. నెలివాడ,దేవుపల్లి గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తయినందున వాటిని త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసేలా సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దత్తిరాజేరు: షికారుగంజి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత జెరాక్స్ పత్రాలను పాఠశాలకు అందజేయాలని సూచించారు.